క్లుప్తంగా

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేసిన దాతలను సత్కరిస్తున్న కోఆర్ ఆఫీసర్ రమణయ్య

దెందులూరు: దెందులూరు సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి పల్లె యుగంధర్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయలను ఆదివారం చర్చి కోర్ ఆఫీసర్ మేజర్ ఎం రమణయ్య, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, సంఘస్తులకు అందజేశారు. జన మౌనిక కమల్ రూ.50 వేలు, పల్లె ప్రఫుల్లచంద్ర రూ. 50వేలు, పల్లె యుగంధర్ సతీమణి అనిత లక్ష రూపాయల నగదును అందజేశారు. ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆర్థిక సాయం అందించిన పల్లె అనితను కోర్ ఆఫీసర్ రమణయ్య, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, సంఘస్తులు సత్కరించారు.

సాయి మందిరంలో ఘనంగా దత్తాత్రేయ జయంతి



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న సాయి మందిరం 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కమిటీ ప్రెసిడెంట్ ఎం అంజలి, ఆలయ నిర్వాహకులు వీరమాచినేని రవి, ప్రధాన అర్చకుడు ఎస్‌వీఎస్‌కే బట్టర్ (బాబు) ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సాయిబాబా భక్తులు 30 వేల దీపాలను వెలిగించి కన్నుల పండువగా దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వేళలో ఓంకారం, శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొడాలి అప్పారావు, భక్తులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో తూరల ఏర్పాటు



పోలసానిపల్లిలో తూరల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

భీమడోలు: పోలసానిపల్లిలో డ్రెయినేజీలో తూరలు ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన డ్రెయినేజీ తూరలను తొలగించి వాటి స్థానంలో కొత్త తూరలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులను ఆదివారం సర్పంచ్ పరిశీలించారు. గ్రామంలోని 4, 7, 8వ వార్డుల్లో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ తూరలు ఏర్పాటు చేసి చాలాకాలం కావడంతో శిథిలావస్థకు చేరాయి. నూతన తూరలను వేసి గ్రావెల్ రోడ్డు నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. యు.జయరామకృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిల్డ్రన్స్ సెమీ క్రిస్మస్ వేడుకలు



చిల్డ్రన్స్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్ అమ్మన్ రాజా

దెందులూరు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం చిల్డ్రన్స్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఫాదర్ అమ్మన్ రాజా క్రిస్మస్ కేకును కట్ చేసి చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ కల్యాణ్ తోట అజిత్, 250 మంది చిన్నారులు, సంఘస్తులు ఉన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్థానిక అగ్రహారంలోని భూ నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 19వ తేదీ వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్వామి వారి సన్నిధిలో ప్రథమ పాశుర విన్నపం నిర్వహించనున్నారు. జనవరి 9న నాచ్చియార్ తిరుక్కోలం నిర్వహించి స్వామి వారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి నుంచి 19వ తేదీ వరకూ స్వామి వారికి అలంకారోత్సవం నిర్వహిస్తారు. 11న ఆండాళ్లు, తాయార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం. 13న భోగి రోజున గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తారు. పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవ స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. 13న గోదా వాసుదేవ స్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

పదిలమైన ఫలితాలే లక్ష్యంగా సాధన

- 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన విద్యాశాఖ
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ
- షెడ్యూల్లో సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మారే అవకాశం
- ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాల్లో 2,079 మంది టెన్త్ విద్యార్థులు



చానమిల్లి జెడ్పీ స్కూల్లో ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు



గణపవరం పీఎంశ్రీ బాలికల జెడ్పీ స్కూల్లో మాదిరి పరీక్షలు పరిశీలిస్తున్న ఎంఈవో బాలయ్య

నిడమర్రు: 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు విద్యాశాఖ ప్రకటించిన నూతన కాలనిర్ణయ పట్టిక ప్రకారం 100 రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎస్‌సీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఆయా స్కూళ్లలో విద్యార్థులను సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులు తరగతులు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు ఉంగుటూరు నియోజకవర్గంలో 2,079 మంది ప్రభుత్వ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ముఖ్యాంశాలు

- జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి సిలబస్ అమల్లోకి వచ్చాక తొలిసారి విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.
- పదో తరగతి విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, అదనపు తరగతుల నిర్వహణ, ప్రిపరేషన్, పదో తరగతి పరీక్షల బ్లూప్రింట్ ప్రకారం ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- జనవరి 13,14,15 తేదీలు (సంక్రాంతి సెలవులు) మినహా అన్ని రోజులూ అదనపు తరగతులు నిర్వహించాల్సి ఉంది.
- సంక్రాంతి సెలవుల్లో ఇంటి దగ్గరే చదువుకునేలా మార్గదర్శకం చేయాలని ఉపాధ్యాయులకు సూచించింది.
- పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు సెషన్లలో తరగతులు నిర్వహిస్తున్నారు.
- విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్‌టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయిస్తున్నారు.
- రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- రోజుకో సబ్జెక్ట్ వంతున వారానికి 7 సబ్జెక్టులు బోధిస్తున్నారు.
- ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్లో స్వల్పమార్పు

2024–25 సంవత్సరానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సబంధించి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇటీవల విడుదలైంది. మార్చి 17 నుంచి ప్రారంభమై 31వ తేదీతో ముగియనున్నాయి. ఈ షెడ్యూల్లో స్వల్పమార్పులు చోటు చేసుకోనున్నట్లు తాజాగా విద్యాశాఖ వెల్లడించింది. మార్చి 31న సాంఘికశాస్త్రం పరీక్ష, అదే రోజు ఒక వేళ నెల వంక కనిపిస్తే రంజాన్ పండుగ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఆ పరీక్షను ఏప్రిల్ 1నకు వాయిదా వేస్తామని అధికారులు ప్రకటించారు. మొత్తం 7 పేపర్లకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇప్పటికే విద్యాశాఖ స్పష్టం చేసింది. సామాన్యశాస్త్రంలో భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి ఒక పేపర్‌గా, జీవ శాస్త్రం మరో పేపర్‌గా ఇవ్వనున్నారు. ఒక్కో పేపర్‌కు రూ.50 మార్కులు చొప్పున 100 మార్కులు కేటాయించారు.

2024-25 టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల వివరాలు

మండలం	జెడ్పీ స్కూల్స్	మొత్తం విద్యార్థులు
ఉంగుటూరు	10	638
నిడమర్రు	07	328
గణపవరం	07	510
భీమడోలు	07	603
మొత్తం	31	2,079

పక్కాగా యాక్షన్ ప్లాన్ అమలు



అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తున్నాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. పదో తరగతి పరీక్షల బ్లూప్రింట్ ప్రకారం ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు. సంక్రాంతి పండు 3 రోజుల మినహా అన్ని సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు కేటాయించిన సబ్జెక్ట్ టీచర్లతో నిర్వహించేలా కృషిచేస్తున్నాం

– గొర్లె బాలయ్య, ఎంఈవో, గణపవరం

సిలబస్ రివిజన్‌కు అవకాశం



ఉదయం, సాయంత్రం రోజుకు ఒక్క సబ్జెక్ట్ చొప్పున ప్రత్యేక తరగతుల వల్ల ఆశించిన స్థాయిలో మార్కులు సాధించే అవకాశం ఉంది. సిలబస్ రివిజన్‌కు మంచి అవకాశం ఏర్పడింది. ఈ తరగతులతో ఎక్కువ సమయం పాఠశాల వద్ద ఉండటం వల్ల ఆయా సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉంటున్నారు. అన్ని సబ్జెక్ట్‌ల్లో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నాను.

– కందుల దివ్య, టెన్త్ విద్యార్థి, పత్తేపురం

స్వీయ మూల్యాంకన పరీక్షలు బాగా రాశా



స్వీయ మూల్యాంకనం (ఫార్మేటివ్ పరీక్షలు)–1 బాగా రాశాను. 300/300 మార్కులు సాధించాను. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. ప్రత్యేక తరగతుల వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. సబ్జెక్ట్ టీచర్లు మా వద్ద ఉండటం వల్ల సందేహాలు వస్తే అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నారు.

– పాతరపల్లి హేమంత్ సాయి, టెన్త్ విద్యార్థి, పత్తేపురం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి చేరి వచ్చిన ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెదవేగి మండలం రాట్నాల కుంటలో వెలసిన రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో భక్తులు దేవస్థానానికి చేరుకుని అక్షరాభ్యాసాలు, నామకరణలు, తదితర మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారి పూజా టికెట్లపై రూ.31,730, లడ్డూ ప్రసాదంపై రూ.27,375, ఫొటోల విక్రయంతో రూ.1,885, విరాళంపై రూ.9,452, మొత్తం రూ.70,442 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వం వ్యాయామ విద్య కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం రాజమండ్రిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. గోపన్నపాలెం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్ తమ కళాశాలకు రావడం సంతోషంగా ఉందని విజేతలను అభినందించారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

ఉంగుటూరు: రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను ఉంగుటూరు నియోజకవర్గ పాత్రికేయులు ఖండించారు. ప్రభుత్వం దాడులను అరికట్టాలని కోరుతూ ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వారు మెమొరాండం అందజేశారు. కడపలో సాక్షి విలేకరిపై జరిగిన దాడిని, మోహన్‌బాబు జర్నలిస్టులపై చేసిన దాడిని వారు ఖండించారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతానని, జర్నలిస్టులకు అండగా ఉంటానని ధర్మరాజు స్పష్టం చేశారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



గారపాటి హైమావతి పాఠశాలలో కలుసుకున్న 1985 బ్యాచ్ విద్యార్థులు

దెందులూరు: స్నేహం ప్రతి ఒక్కరికీ దేవుడిచ్చిన వరమని ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ అందరూ 40 ఏళ్ల తర్వాత కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థి, దెందులూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ గారపాటి కొండయ్య చౌదరి, పూర్వ విద్యార్థి చింతలపూడి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బి శేఖర్, ప్రముఖ బిల్డర్ వి సురేష్, ఏలూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యాషియర్ కె అజరయ్య అన్నారు. దెందులూరు మండలం దెందులూరు శ్రీ గారపాటి హైమావతి దేవి ఉన్నత ప్రభుత్వ హైస్కూల్లో 1985–86 ఆర్థిక సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలిసి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన హెచ్‌ఎం బోదుల శేఖర్ మాట్లాడుతూ 40 ఏళ్ల అనంతరం బాల్య స్నేహితులను కలుసుకునేందుకు పలువురు దూర ప్రాంతాలనుంచి రావడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన మిత్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి, సహపంక్తి భోజనాలు చేశారు. సీనియర్ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులందరూ కలిసి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఎన్ రాధాకృష్ణ, కె ప్రభాకర్, వై రామకృష్ణ, ఎం వెంకటేశ్వరరావు (వెంకన్న), ఇంజనీరింగ్ కాలేజీ టెక్నికల్ అసిస్టెంట్ మాగంటి సీతారాంప్రసాద్, ఎస్ మారనాథరాజు, పూర్వ విద్యార్థినులు రోజా, రాణి, జయలక్ష్మి పద్మ, సత్యవతి, రాజేశ్వరి, విజయ నిర్మల ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



భీమడోలులో చలో గుంటూరుకు తరలివెళ్తూ నినాదాలు చేస్తున్న నాయకులు, యువకులు

భీమడోలు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం గుంటూరులో నిర్వహించిన హలో మాల– చలో గుంటూరు కార్యక్రమానికి భీమడోలు నుంచి మాల సంఘాల నాయకులు తరలివెళ్లారు. భీమడోలులో చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాము మాన్‌సింగ్ ఆధ్వర్యంలో భీమడోలు నుంచి యువకులు, పెద్దలు, అధిక సంఖ్యలో బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. రాజ్యాంగంలో వర్గీకరణ పొందుపర్చలేదని, అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీలను విభజించడం సమంజసం కాదని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేసారు. వర్గీకరణ వల్ల మాల జాతి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, వెంటనే ఈ ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం



పాతూరి శివన్నారాయణ కల్యాణ మండపంలో ఉచితంగా మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: చిన్నారులకు సుగరు నిర్ధారణ పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆదివారం ఆల్‌ఇండియా డయాబెటిస్ రీసెర్చి సెంటరు అధినేత డాక్టర్ పీవీ రావు ఆధ్వర్యంలో ఉంగుటూరు పాతూరి శివన్నారాయణ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇన్సులిన్, టెస్టు కిట్లు, ప్రొటీన్ పౌడర్, మందులు అందజేశారు. సుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు డాక్టర్ పీవీ రావు అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీని ప్రారంభించారు. ప్రతి నెల ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అభినందించారు. హాజరైన వారికి అల్పాహారం అందజేశారు. 70 మంది పిల్లలకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సేవాదళం స్థాపకుడు పాతూరి వంశీ, సర్పంచి బండారు సింధు, పాతూరి విజయకుమార్, వైస్ ప్రెసిడెంటు పాతూరి జగదీష్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

దెందులూరు: హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.లావణ్య అన్నారు. ఆదివారం దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కాలేజీ ప్రిన్సిపల్ ఎం.లావణ్య, కళాశాల ఏవో కరుణానిధి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లావణ్య మాట్లాడుతూ 16 నుంచి ఈనెల 21వ తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలోని యూనివర్సిటీ స్థాయిలో బాలుర విభాగంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని కాలేజీ ఆవరణలో యూనివర్సిటీ స్థాయి బాలుర క్రికెట్ పోటీల్లో 65 టీంలు పాల్గొంటారని వారు తెలిపారు. వారికి అవసరమైన క్రీడా మైదానం అభివృద్ధి చేయడంతోపాటు వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు



దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎన్‌జీఓ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ సంఘం ద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం దివంగత షేక్ సాబ్జీ ప్రథమ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ రవికుమార్ రుద్రాక్షి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్లు నెరుసు రామారావు, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, సాబ్జి సతీమణి సుభాన్ బేగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపిమూర్తి ఎమ్మెల్సీగా విజయం సాధించడానికి సహకరించిన వివిధ సంఘాల ప్రతినిధులతో అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌కు మద్దతు తెలిపిన ఏపీటీఎఫ్ 1938, బీటీఏ, ఆదిమవాసి టీచర్స్ అసోసియేషన్ నాయకులు జీ. మోహన్, గుడిమెల్ల వెంకటేశ్వరరావు, ఎంఈఓల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సబ్బితి నరసింహమూర్తి, ప్రజా సంఘాల నాయకులు, ఆర్టీసీ, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ హాజరై జనవరి 5 నుంచి 8వ తేదీ వరకూ కాకినాడలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను 20వేల మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సభలకు వేలాది మంది ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సభల్లో ఉపాధ్యాయుల, విద్యార్థుల, పాఠశాలల సమస్యలపై చర్చిస్తారన్నారు.

ప్లాస్టిక్.. పెనుభూతం

- నిషేధం రికార్డులకే పరిమితం
- యథేచ్ఛగా వినియోగం
- అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం



కవర్లలో సామాగ్రి తీసుకువెళ్తున్న దృశ్యం (ఫైల్)



ఇళ్ల మధ్య ఉన్న ఖాళీస్థలంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

పెదవేగి : ప్లాస్టిక్ వినియోగం అధికమై పర్యావరణానికి విఘాతంగా మారింది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తిస్థాయిలో అమలైన జాడలే దు. దాంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీల్లో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్లాస్టిక్ పెనుభూతమై కూర్చుంది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వాదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించేవారు. కొంతకాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలు పెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక్ కవర్లు వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకుని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా వాటి వినియోగమే కాదు. రీసైక్లింగ్ కూడా జరుగుతోంది. పాస్టిక్ కవర్ల వినియోగం పర్యావరణానికి చాలా ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం

ఈ మధ్యనే మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీ శాఖ చర్యలు చేపట్టింది. అయినా నగరంలో ఏ దుకాణం చూసినా ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్తకుప్ప, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు ముందుగా కవర్లు లేవంటున్నారు. వినియోగదారులు కొనుగోలుచేసిన వస్తువులు వదిలివెళ్లిపోతుంటే వ్యాపారులు ప్లాస్టిక కవర్లు ఇస్తున్నారు. కవర్లు లేకపోతే తమకు వ్యాపారం జరగడంలేదని, వినియోగదారులు ఏ విధమైన సంచులు తీసుకురాకుండా మార్కెట్‌కు వస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ఆరు నెలలుగా 30 నుంచి 40శాతం వరకూ ఇవే ఉంటున్నాయి. ఏ చెత్తకుప్ప చూసినా, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంవల్లే నిషేధం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆదివారం ఆవిష్కరించారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డైరీని ఆవిష్కరించారు. పలువురు ఎస్టీ ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.